# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల కుమ్రం భీం ఆసిఫాబాద్
3 | శనివారం 17 ఫిబ్రవరి 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD









చెన్నూర్ : సమస్యలు పరిష్కరించాలని నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవరు

# కదంతొక్కిన ఆటో డ్రైవర్లు

- ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్
- పలుచోట్ల నిరసనలు

చెన్నూర్/చింతలమానేపల్లి/దహెగాం, ఫిబ్రవరి 16 : రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మహాలక్ష్మి పథకంతో వీధిన పడ్డామని, తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లు కదం తొక్కారు. పలుచోట్ల నిరసనలు చేపట్టారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌లో శుక్రవారం ఆటోలు బంద్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రారంభించినప్పటి నుంచి తమకు కష్టాలు మొదలయ్యాయని, గిరాకీలు లేక ఫైనాన్స్‌లు కట్టలేక పోతున్నామని, కుటుంబాలను పోషిసంచుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు, తమ కుటుంబ సభ్యులతో కలిసి ధర్నా చేశారు. ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు షేక్ దస్తగిరి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తమకు జీవన భృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లు రియాజ్, మొర్లె బాపురావ్, నాగేశ్, తిరుపతి, మీసాల తిరుపతి, సల్మాన్, సంతోష్, వెంకటేశ్, రమేశ్ పాల్గొన్నారు. దహెగాంలో ఆటో డ్రైవర్లు బంద్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు శ్రీకాంత్, శంకర్, లక్ష్మణ్, రవి, మహేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



దహెగాంలో నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

# మెరుగైన వైద్యమందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మందమర్రిలో డాక్టర్ రమేశ్‌తో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

మందమర్రి, ఫిబ్రవరి 16 : ప్రభుత్వ దవాఖానలకు వచ్చే పేదలకు మెరుగైన వైద్య సేవలందించాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి ఖుష్బూ గుప్తా సూచించారు. శుక్రవారం మందమర్రి పట్టణంలోని పాత బస్టాండ్ ఏరియాలో గల పీహెచ్‌సీని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని విభాగాలను పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవల వివరాలను డాక్టర్ రమేశ్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ దవాఖానలపై ప్రజలకు మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.


### బెల్లంపల్లి నర్సరీని పరిశీలించిన పీవో

బెల్లంపల్లిరూరల్, ఫిబ్రవరి 16 : బెల్లంపల్లిలోని ఐటీడీఏ పండ్లతోటల నర్సరీని పీవో ఖుష్బూ గుప్తా పరిశీలించారు. బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి వచ్చిన ఆమెకు ప్రాజెక్ట్ ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. నర్సరీలోని మామిడి, మల్లె, మునగ, ఇతర అలంకరణ మొక్కలను ఆమె పరిశీలించారు. సాగులో ఉన్న సపోట, మామిడి తోటలను ఆమె పరిశీలించి వాటి నుంచి మెరుగైన ఆదాయం రావడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలుసుకున్నారు. ఉద్యానపంటలు సాగు చేసే రైతులకు ఐటీడీఏ ద్వారా సహకారం అందిస్తామని తెలిపారు. ఐటీడీఏ ప్రాంత అభివృద్ధి కోసం, గిరిజనరైతుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చడానికి అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సూచించారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సుధీర్‌కుమార్, నర్సరీ టెక్నికల్ అసిస్టెంట్ పూజ, సిర్పూర్ పేపర్‌మిల్ అసిస్టెంట్ మేనేజర్ దేవరాజ్, సిబ్బంది రాజమల్లు, రాహుల్ పాల్గొన్నారు.

# నిద్రావస్థలో వైద్యారోగ్యశాఖ

## 'నమస్తే తెలంగాణ' స్పెషల్ విజిట్‌తో వెలుగులోకి ఆసక్తికర విషయాలు

- ఏ ఒక్క చోటా సమయపాలన పాటించని వైద్యాధికారులు, సిబ్బంది
- తాళాలు వేసి ఉన్న పీహెచ్‌సీలు.. ఖాళీ కుర్చీలు దర్శనం
- వాట్సప్‌గ్రూప్‌లో మెస్సేజ్ పెట్టి అలర్ట్ చేసిన డాక్టర్
- హుటాహుటిన విధులకు పరుగులు
- బాధ్యత మరచి వెకిలి వేషాలు
- బయోమెట్రిక్ అటెండెన్స్‌కు మంగళం
- విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు : డీఎంహెచ్‌వో సుబ్బారాయుడు


Today

Dr Mustafa @pechikalpet
All of you be allert 09:10
At sharp 9 am only 09:11

Dr Evanjelin@ Thallagurjala
Yes they have taken photos of many PHCs 09:36
All are Showing empty OP Chairs 09:37

నమస్తే తెలంగాణ విజిట్ ఉందని వాట్సాప్ గ్రూప్‌లో ఓ డాక్టర్ పెట్టిన మెస్సేజ్ (స్క్రీన్ షాట్)



జైపూర్ పీహెచ్‌సీలో ఉదయం 10.10 గంటలకు మూసి ఉన్న మెడికల్ ఆఫీసర్ గది

మంచిర్యాల, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలో వైద్యారోగ్యశాఖకు నిర్లక్ష్యపు రోగం పట్టుకున్నది. ఏమాత్రం సమయపాలన పాటించకుండా నిద్రావస్థలో తూగుతున్నది. ఉదయం 9 గంటల నుంచి సాయత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాల్సిన అధికారులు, సిబ్బంది, ఉదయం 11 గంటలైనా రావడం లేదన్న విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం 'నమస్తే తెలంగాణ' స్పెషల్ విజిట్ చేయగా, ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. జిల్లాలోని 17 పీహెచ్‌సీలు(ప్రైమరీ హెల్త్ సెంటర్లు), 4 యూపీహెచ్‌సీలు(అప్పర్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు), 3 సీహెచ్‌సీ (కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు), బస్తీ దవాఖానలను సందర్శించగా, ఎక్కడా ఏ ఒక్క అధికారి కానీ.. సిబ్బంది కానీ.. 9 గంటలకు విధులకు రాకపోవడం గమనార్హం. 'నమస్తే తెలంగాణ' వెళ్లి ఖాళీ కుర్చీలు, తాళాలు వేసి ఉన్న పీహెచ్‌సీల ఫొటోలు తీశాక, స్వీపర్లు సిబ్బంది ద్వారా సమాచారమందుకొని హుటాహుటిన విధులకు వచ్చారు. పాత మంచిర్యాల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముస్తఫా ఉదయం 9.10 గంటలకు విధులకు వచ్చారు. ఇలాంటి విజిట్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలుసుకున్న ఆయన, జిల్లా డాక్టర్ల వాట్సప్ గ్రూప్‌లో మెస్సేజ్ పెట్టి.. మిగిలిన డాక్టర్లను అలర్ట్ చేశారు. ''ఆల్ ఆఫ్ యూ బీ అలర్ట్, ఎట్ షార్ప్ 9 ఏఎం ఓన్లీ'' అని ఆయన పెట్టిన మెస్సేజ్‌కు తాళ్ల గురిజాల పీహెచ్‌సీ డాక్టర్ ఇమాంజనిల్ ''యస్ థే హ్యావ్ టేకెన్ ఫొటోస్ ఆఫ్ మెనీ పీహెచ్‌సీస్, ఆల్ ఆర్ షోయింగ్ ఎంప్టీ చైర్స్'' అంటూ మరో మెస్సేజ్ పెట్టారు. ఈ మేడమ్ ఉదయం 9.26 గంటలకు డ్యూటీకి వచ్చారు. విషయం తెలుసుకున్న మెడికల్ ఆఫీసర్లు హుటాహుటిన పీహెచ్‌సీలకు పరుగులు పెట్టారు. కొన్నిచోట్ల సిబ్బందిని అలర్ట్ చేసి పంపించారు. రోజూ 11 గంటల నుంచి 12 గంటల మధ్యలో విధులకు వచ్చే డాక్టర్లు సైతం 'నమస్తే' విజిట్ గురించి తెలుసుకొని ఉదయం 10.30లోపు వచ్చారంటూ ఆయాచోట్ల పని చేసే సిబ్బంది గుసగుసలాడుకోవడం కనిపించింది. డాక్టర్లకు గ్రూప్‌లో సమాచారమివ్వడం వల్ల ఈ ఒక్క రోజు ముందు డ్యూటీకి వచ్చారు. అదే విషయం తెలిసి ఉంటే తాము కూడా ముందే వచ్చే వాళ్లమని ఒకరికొకరు చెప్పుకోవడం కనిపించింది. రోజూ డాక్టర్ కంటే ముందు వచ్చేవాళ్లం.. ఈ రోజు లేట్‌గా వచ్చినట్లయ్యిందంటూ అసలు విషయం చెప్పుకొచ్చారు.

### ఆలస్యంగా వచ్చి.. వెకిలి వేషాలు..


డాక్టర్ల గ్రూప్‌లో మెస్సేజ్‌తో త్వరగా పీహెచ్‌సీలకు వచ్చిన వైద్యాధికారులు రిపోర్టర్లతో అత్యుత్సాహం ప్రదర్శించారు. మీరు వస్తారని మాకు ముందే తెలుసు.. మా వాట్సప్ గ్రూప్‌లో మెస్సేజ్ వచ్చిందంటూ కొందరు డాక్టర్లు జోక్‌లు చేస్తూ వెకిలి వేషాలు వేశారు. కొందరు మెడికల్ ఆఫీసర్లు సిబ్బందితో ఫోన్‌లు మాట్లాడించి.. మా ఇంట్లో వాళ్లకి ఆరోగ్యం బాగోలేదు. అందుకే సమయానికి రాలేకపోతున్నామని.. కొంచెం చూడాలంటూ రిక్వెస్ట్ చేశారు. మంచిర్యాలతో పాటు బెల్లంపల్లి, చెన్నూర్ పట్టణ ప్రాంతాల్లో ఉన్న పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు కొంత ఆలస్యంగా విధులకు హాజరైనప్పటికీ.. మిగిలిన గ్రామీణ ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో విధులు నిర్వహించే వైద్యాధికారులు, సిబ్బంది గంట, గంటన్నర ఆలస్యంగా వచ్చారు. నమస్తే తెలంగాణ పరిశీలించిన పీహెచ్‌సీల్లో వైద్యులు డ్యూటీకి వచ్చిన టైమింగ్ వివరాలిలా ఉన్నాయి.. కన్నేపల్లి పీహెచ్‌సీకి 10.25, తాండూర్‌లో 10.34, హాజీపూర్‌లో 10.15, వేమనపల్లిలో 11.17, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడ బస్తీ దావాఖానాకు 11.36, రాజీవ్‌నగర్‌లో 10.20, నస్పూర్‌లో 9.17, జన్నారంలో 9.25, భీమిని 10.27, తాళ్లపేటలో 9.45, నెన్నెల 10.10, తాళ్ల గురిజాలలో 9.50, జైపూర్‌లో 9.30, మందమర్రిలో 9.26, కోటపల్లిలో 9.40 గంటలకు మెడికల్ ఆఫీసర్లు విధులకు వచ్చారు. డాక్టర్లు ఆలస్యంగా రావడంతో కొన్నిచోట్ల సిబ్బంది వైద్యం చేస్తూ కనిపించారు. నెన్నెల పీహెచ్‌సీలో సిబ్బంది ఎవరూ లేకపోవడంతో వార్డుబాయ్ ట్రీట్‌మెంట్ చేస్తూ కనిపించారు. జన్నారం పీహెచ్‌సీలో ఏఎన్ఎం సెలైన్ ఎక్కిస్తూ కనిపించారు. అన్ని ఆసుపత్రుల్లో వైద్యాధికారులకంటే ఆలస్యంగా స్టాఫ్‌నర్సులు, ఫార్మసిస్టులు, వార్డు బాయ్స్ ఇతర సిబ్బంది రోజూ వచ్చినట్లే 10 గంటల తర్వాత ఒకొక్కరిగా విధులకు హాజరయ్యారు.

### అటకెక్కిన బయోమెట్రిక్ అటెండెన్స్

కేసీఆర్ ప్రభుత్వంలో వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన కచ్చితంగా పాటించాలనే ఉద్దేశంతో అప్పటి కలెక్టర్ భారతీ హొళికేరి అన్ని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాల్లో బయోమెట్రిక్ హాజరును ప్రవేశపెట్టారు. దీన్ని పర్యవేక్షణ కోసం కలెక్టరేట్‌లో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ కార్యాలయంలో ఒకరిని నియమించారు. ప్రతి రోజూ డాక్టర్లు, ఇతర సిబ్బంది ఆసుపత్రికి చేరుకున్నాక బయోమెట్రిక్ హాజరు వేయాల్సి ఉండేది. దాని ఆధారంగానే వారికి వేతనాలు సైతం ఇచ్చేవారు. కానీ.. కొన్ని నెలలుగా బయోమెట్రిక్ అటెండెన్స్ అటకెక్కింది. దీంతో వైద్యాధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా సాగుతూ వస్తున్నది. వైద్యాధికారుల ఇష్టారాజ్యం గురించి డీఎంహెచ్‌వోకు తెలిసినా కూడా పట్టించుకోవడం లేదని తెలిసింది. బయోమెట్రిక్ హాజరుతో సంబంధం లేకుండా మ్యానువల్‌గా అందరికీ వేతనాలు ఇవ్వడం వెనుక మర్మమేమిటనేది తెలియాల్సి ఉంది. వైద్యాధికారుల నిర్లక్ష్యంతో వైద్యం కోసం వచ్చే జనాలు ప్రైవేటుకు తరలిపోతున్నారు. ముమ్మాటికీ ఇది వైద్యుల కారణంగానే జరుగుతున్నా.. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తిన్నట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై డీఎంహెచ్‌వో సుబ్బారాయుడిని వివరణ కోరగా.. ''ఇటీవల కలెక్టర్ రివ్యూలో బయోమెట్రిక్, పేషియల్ అటెండెన్స్ పెట్టాలని సూచించాం. ఈ మేరకు వైద్యాధికారులు సమాచారం అందించాం. విధులకు ఆలస్యంగా రావొద్దని చెప్పాం. ఈ రోజు 21 మంది సమయానికి వచ్చినట్లు నాకు చెప్పారు. కానీ మీ పరిశీలినలో వైద్యాధికారులు ఆలస్యంగా వచ్చినట్లు తేలిందంటున్నారు. మరొకసారి పరిశీలించి వైద్యాధికారులు సమయానికి విధులకు హాజరయ్యేలా చూస్తాం. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఎవ్వరినీ వదిలేదు లేదు.' అని చెప్పారు.



నెన్నెల పీహెచ్‌సీలో సమయానికి సిబ్బంది రాకపోవడంతో ట్రీట్‌మెంట్ చేస్తున్న వార్డుబాయ్



భీమనిలో 10 గంటలకు ఖాళీగా కనిపిస్తున్న వైద్యాధికారి కుర్చీ



తాండూర్‌లో 9 గంటలు దాటినా తెరచుకోని పీహెచ్‌సీ



ఉదయం 9.51 గంటలకు కూడా తెరచుకోని మంచిర్యాల హమాలీవాడ బస్తీ దవాఖాన




తాండూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ తీస్తున్న అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు

# కేంద్రంపై కన్నెర్ర

## గ్రామీణ భారత్‌బంద్‌లో భాగంగా హోరెత్తిన నిరసనలు

- వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్వంలో రాస్తారోకోలు, ధర్నాలు
- బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మలు దహనం
- వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని డిమాండ్
- గనులపై నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

మంచిర్యాల, ఫిబ్రవరి 16 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌లో నిరసనలు హోరెత్తాయి. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కార్మిక సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు కేంద్రంపై కన్నెర్రజేస్తూ ఆందోళనలు నిర్వహించాయి. రెబ్బెన, గోలేటి సీహెచ్‌పీల వద్ద ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఏరియాలోని ఖైర్‌గూడ ఓసీపీ, బీపీ ఏవోసీపీ గనులతో పాటు వివిధ డిపార్ట్‌మెంట్‌లు, గోలేటి జీఎం కార్యాలయంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్.తిరుపతి, ఉపాధ్యక్షుడు బయ్యా మొగిలి, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్ కార్మికులకు, ఉద్యోగులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. పెంచికల్‌పేట్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్ల మండల అధ్యక్షురాలు రాజమణి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీఐటీయూ మద్దతు తెలిపింది. సిర్పూర్(యు) మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జీపీ కార్మికులు, ఆశ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన కార్మికులు, ఐకేపీ ఉద్యోగులు సమ్మె చేపట్టారు. కారోబార్ సంఘం మండలాధ్యక్షుడు గోడం శెడ్మరావ్ పాల్గొన్నారు.

### మంచిర్యాలలో..

మంచిర్యాలలో కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఏఐటీయూసీ కార్యాలయం నుంచి మంచిర్యాల రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ తీశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ప్రజలు, కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. కోటపల్లి మండల కేంద్రంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని, సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కావెర రవి డిమాండ్ చేశారు. దండేపల్లి మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ తీసి.. నిరసన తెలిపారు. శ్రీరాంపూర్, నస్పూర్‌లో ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ నాయకులు ఆందోళనలు చేపట్టారు. శ్రీరాంపూర్ ఏరియా గనులపై ఐఎన్‌టీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సింగరేణి గనులు సంస్థకు అప్పగించాలని, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీసీసీ కార్నర్ వద్ద సీపీఐ మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య, సమ్మయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు రాస్తారోకో చేశారు. శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ వద్ద సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కేంద్రం దిష్టిబొమ్మ దహనం చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని బజార్ ఏరియా నుంచి కాంటా చౌరస్తా వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. జైపూర్‌లో ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికులు సమస్యలు పరిష్కరించాలని జీఎం బస్విరెడ్డికి వినతిపత్రం అందించారు. మందమర్రి పట్టణంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు నిరసనలు తెలిపారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట కోల్‌బెల్ట్ రహదారిపై రాస్తారోకో చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు జీఎం కార్యాలయం ఎదుట, ఏరియా స్టోర్, వర్క్‌షాప్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. తాండూర్‌లోని బీపీఏ ఓసీపీ-2 వద్ద ఐఎన్టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, సీనియర్ నాయకుడు సంగెం ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు, కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.




మంచిర్యాల అర్బన్ : రాస్తారోకో చేస్తున్న కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు



రెబ్బెన : ఖైర్‌గూడలో కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి తిరుపతి, ఉపాధ్యక్షుడు మొగిలి



సిర్పూర్(యు) : తహసీల్ కార్యాలయ ఆవరణలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశ కార్యర్తలు

# సీపీఎస్‌ను రద్దు చేయాలి

- టీఎన్జీవో నాయకుల డిమాండ్
- కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన




కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టీఎన్జీవో నాయకులు

హాజీపూర్, ఫిబ్రవరి 16 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ పింఛన్ విధానాన్ని తీసుకురావాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లోని జిల్లా కలెక్టర్ కార్యాలయ ఎదుట తెలంగాణ నాన్ గెజిటెడ్ (టీఎన్జీవో) ఉద్యోగుల సంఘం ఆధ్వర్వంలో నల్ల బ్యాడ్జీలను ధరించి భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి, టీఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి భూముల రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీపతి బాపురావ్, మంచిర్యాల యూనిట్ అధ్యక్షుడు నాగుల గోపాల్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

# జైపూర్ ఏసీపీగా వెంకటేశ్వర్లు బాధ్యతల స్వీకరణ

జైపూర్, ఫిబ్రవరి 16 : జైపూర్ ఏసీపీగా ఏ వెంకటేశ్వర్లు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన బీ మోహన్‌ను హైదరాబాద్‌లోని డీజీపీ ఆఫీస్‌కు అటాచ్డ్ చేయగా, హైదరాబాద్ సిటీ ఏసీపీ డీడీ-సీసీగా పని చేసిన వెంకటేశ్వర్లు ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో ఇక్కడకు వచ్చారు. జైపూర్ ఏసీపీ సర్కిల్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



జైపూర్ ఏసీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న ఏ వెంకటేశ్వర్లు